సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 27 । జూలై । 2023



'కడెం' దశ మారేనా?

గతంలో కడెం ప్రాజెక్ట్ పూర్తిగా నిండి గేట్లు ఎత్తేందుకు సైరన్ వేస్తే జనం సంబురపడ్డారు. నేడు అదే సైరన్ విని ప్రాజెక్ట్ కొట్టుకుపోతుందేమోనని జంకుతున్నారు. 10లో▸

నేడు కాంగ్రెస్ నిరసన

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని వినతి

- అమిత్ షాను కలిసిన ఎంపీ 'సోయం'



అమిత్‌షాతో మాట్లాడుతున్న ఎంపీ సోయం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ఎంపీ సోయం బాపూరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరినట్లు ఎంపీ తెలిపారు. అలాగే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఆయన వెంట ఆదివాసీ సంఘం నాయకులు రామకృష్ణ, బాలరాజు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ తదితరులున్నారు.

ఆగస్టు 12న 'టెక్నికల్ టీచర్' పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (లోయర్ గ్రేడ్) పరీక్ష ఆగస్టు 12న నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలు హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ ప్రాంతాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. 42 రోజుల సమ్మర్ శిక్షణ కోర్సు, 2023 పరీక్ష రాసి ఫెయిల్ అయినవారు హాజరు కావాలని సూచించారు.

'తొలిమెట్టు' పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న సువర్ణ వినాయక్

ఆదిలాబాద్‌టౌన్: తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర విద్యా శిక్షణ సమన్వయకర్త సువర్ణ వినాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద బీఎడ్ కళాశాలలో నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. రిసోర్స్ పర్సన్లు మండల స్థాయిలో పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతినెలా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి నర్సయ్య, రవిప్రకాశ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



పీరీల వద్ద ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తలమడుగు: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం అని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పండుగ నేపథ్యంలో మండలంలోని రుయ్యాడి గ్రామంలో గల హస్సేన్ హుస్సేన్ మందిరాన్ని ఎస్పీ బుధవారం సందర్శించి పీరీలను మొక్కుకున్నారు. పండుగను అన్ని వర్గాల వారు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావు, పాడీ పరిశ్రమ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, స్థానిక ఎస్సై ధనశ్రీ,, సర్పంచ్ పోతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: కుల వృత్తిపై ఆధారపడి జీవించే జిల్లాలోని మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్యయోజన పథకం కింద చేపల విక్రయ సంచార వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, ఐస్ బాక్స్‌లను సబ్సిడీపై అందిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు ప్రకటనలో తెలిపారు. వీటి కోసం అర్హులైన మత్స్యకారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60శాతం, ఇతరులకు 40శాతం సబ్సిడీపై ఈ వాహనాలను అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల 18నుంచి 50 ఏళ్ల లోపు కలిగిన మత్స్య పారిశ్రామిక సంఘాల్లోని సభ్యులు ఈనెల 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి తొలిప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.



కలెక్టర్ కార్యాలయం

ఎన్నికల బదిలీలు

- కొనసాగుతున్న ప్రక్రియ
- ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖల్లో..
- పారదర్శకంగా ఎలక్షన్ నిర్వహణ కోసం

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల వాతావరణం వచ్చేస్తోంది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు ఇప్పటికే మొదలయ్యాయి. జిల్లాలోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖల్లో ట్రాన్స్‌ఫర్లు కీలకంగా మారాయి. ఎన్నికల నిర్వహణలో ఇటు రెవెన్యూ నుంచి రిటర్నింగ్ అధికారులుగా, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసు విభాగం ముఖ్య భూమిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎలక్షన్ అనగానే ఈ రెండు శాఖలపై ఫోకస్ కనిపిస్తుంది. మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని, సొంత జిల్లా, నియోజకవర్గాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో ఈ నెల 31 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసేవిధంగా యంత్రాంగం దృష్టి సారించింది.

పోలీసు శాఖలో సమూలంగా..

ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు శాఖదే. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున సీఐలు, ఎస్సైల బదిలీలు జరిగాయి. ఇటీవల 26 మంది కొత్త ఎస్సైలు జిల్లాకు రావడం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ప్రధానంగా లాఅండ్ ఆర్డర్ పరిరక్షణ విషయంలో పోలీసు శాఖపై ఒత్తిడి ఉంటుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రచారాల నిర్వహణలో సమయసారిణి వంటి అంశాలను కఠినంగా పరిశీలన చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాల పరంగా భద్రతను పర్యవేక్షిస్తూనే ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు పూర్తిస్థాయిలో ఈ శాఖ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో రాబోయే ఎన్నికల కాలంలో పోలీసు శాఖ విధుల నిర్వహణ కీలకం కానుంది.

ముఖ్య అధికారుల బదిలీలు..

రెవెన్యూశాఖ పరంగా ఇప్పటికే ముఖ్య అధికారుల బదిలీలు జరిగాయి. జిల్లా అదనపు కలెక్టర్ నటరాజ్ బదిలీ చోటు చేసుకుంది. ఆయన స్థానంలో శ్యామలా దేవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే ఆదిలాబాద్ ఆర్డీవో రాథోడ్ రమేశ్ స్థానచలనం జరగగా, ఆయన ప్లేస్‌లో స్రవంతి బాధ్యతలు చేపట్టారు. ఉట్నూర్ ఆర్డీవో కదం సురేష్ స్థానభ్రంశం జరిగినప్పటికీ ఆ స్థానంలో ఎవరిని నియమించలేదు. దీంతో ప్రస్తుతం ఆయననే కొనసాగుతున్నారు. ఇక్కడికి బదిలీపై ఎవరైనా అధికారి వస్తే ఆయన రిలీవ్ కానున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ గత ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టారు. ఆరు నెలలు మాత్రమే కావడంతో ఆయన బదిలీ ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి ఏడాదిన్నర క్రితం ఇక్కడికి వచ్చారు. ఆయన బదిలీపై క్లారిటీ లేదు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. అంతేకాకుండా ఎంపీవోలను కూడా బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది.

డీటీసీ సీఐగా ఎస్ఎస్ ప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ సీఐగా ఎస్ఎస్ ప్రసాద్ జిల్లాకు బదిలీపై రానున్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన నిజామాబాద్ జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. ఇదివరకు రూరల్ సీఐగా పనిచేసి బదిలీపై వెళ్లిన రఘుపతికి సిరిసిల్ల జిల్లాలో పోస్టింగ్ లభించింది.

అదనపు కలెక్టర్‌గా శ్యామలాదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యామలాదేవి

కైలాస్‌నగర్: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కే.శ్యామలాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నియామకానికి సంబంధించి ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నమే ఉత్తర్వులు జారీ చేయగా, సాయంత్రానికే జిల్లాకు చేరుకున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెవెన్యూపరమైన సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాగా ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఎస్.నటరాజ్‌ను ఖమ్మం జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బేతి రాజేశంను నియమించింది. ఆయన బాధ్యతలు స్వీకరించకముందే ఆ నియామకాన్ని రద్దు చేసిన ప్రభుత్వం ఇటీవలే ఉట్నూర్ గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియామకమైన శ్యామలాదేవీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు నటరాజ్‌ను తొలుత ఖమ్మం జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం దాన్ని రద్దు చేసి జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే జోగు రామన్న
- ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: అమర సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాడు పాకిస్తాన్‌తో జరిగిన పోరులో అమరులైన వీర సైనికులకు స్మరిస్తూ బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులతో పాటు మాజీ సైనికులు, సనాతన హిందూ ఉత్సవ సమితి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొని ఘన నివాళులర్పించారు. మున్సిపల్ పార్కులోని అమర వీరుల స్తూపం వద్ద జాతీయ జెండా, పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అమరుల త్యాగాలను కొనియాడారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, డీసీసీబీ చైర్మన్లు ప్రేమేందర్, భోజారెడ్డి, కెప్టెన్ మజర్, సైనిక సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

- కార్గిల్ విజయ్ దివస్‌ను గ్రామగ్రామన నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. ఇందులో బీజేపీ నాయకులు సుహాసినిరెడ్డి తదితరులున్నారు.
- దేశ రక్షణ కోసం ప్రాణాలను తెగించి పోరాడుతున్న సైనికులకు అండగా నిలవాల్సిన అవసరముందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నాయకులు నగేష్, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.
- మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి నివాళులర్పించారు.
- చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అమర సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కమల్ కిశోర్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి గండ్రత్ సంతోష్, కోశాధికారి నితీష్ మఖరీయ పాల్గొన్నారు.
- సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీ
- కేస్లాపూర్–ముత్నూర్ మార్గంలో ఘటన





చిత్రు, వినోద్ మృతదేహాలు





ప్రమాదంలో గాయాలపాలైన యువకులు

ఇంద్రవెల్లి: జోరు వానలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలవగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన తుంరం వినోద్(23) అదే గ్రామానికి చెందిన ఆడ జైతు ఇద్దరు బైక్‌పై తమ గ్రామ పీరీలు, డోలా బృందంతో కలిసి కేస్లాపూర్ వెళ్లారు. తిరిగి రాత్రి వర్షంలోనే ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన సేద్మకి చిత్రు(25) మరో ఇద్దరితో కలిసి బైక్‌పై ఎదురుగా వస్తున్నారు. ఓ వైపు వర్షం కురుస్తుండగా కేస్లాపూర్–ముత్నూర్ మార్గంలో ఈ రెండు వాహనాలు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో చిత్రు, వినోద్ అక్కడికక్కడే మృతి చెందారు. వారి వెంట ఉన్న ఆడ జైతు, తాటిగూడ గ్రామానికి చెందిన రమేశ్, సేద్మకి లచ్చుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు వినోద్‌కు ఏడాది క్రితమే వివాహమైంది.

బయోమె'ట్రిక్స్'!

- జిల్లాలో అమలు అంతంతే..
- సమయపాలన పాటించని టీచర్లు
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- విద్యార్థుల చదువుపై ప్రభావం

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: 467
ప్రాథమికోన్నత పాఠశాలలు: 107
ఉన్నత పాఠశాలలు: 104
జిల్లాలో బయోమెట్రిక్ యంత్రాలు :822
బయోమెట్రిక్ హాజరువేసే ఉపాధ్యాయులు, సిబ్బంది:3,282



పాఠశాలలో బయోమెట్రిక్ హాజరును పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా ప్రభుత్వం బయోమెట్రిక్ అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ చాలామంది పంతుళ్లు 'ట్రిక్స్' ఉపయోగించి వాటిని అమలుకు నోచుకోకుండా చేస్తున్నారు. నెట్‌వర్క్ సమస్య, యంత్రాల మరమ్మతులు తదితర కారణాలు చూపుతూ వాటిలో హాజరు వేయట్లేదు. సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పర్యవేక్షించాలిస్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కరోనా తర్వాత గతేడాది ఆగస్టు నుంచి బయోమెట్రిక్ హాజరును పునఃప్రారంభించినప్పటికీ రెండు, మూడు నెలలు మాత్రమే వాటి పర్యవేక్షణ కొనసాగింది. తర్వాత ఏదో సాకు చూపి వాటిని మూలనపడేస్తున్నారు. ఈ యంత్రాలు పనిచేసిన సమయంలో సమయపాలన పాటించేందుకు పరుగుతీసిన పంతుళ్లు.. ప్రస్తుతం ఎప్పుడైనా వెళ్లొచ్చు కదా అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు.

అమలుకు నోచుకోని వైనం..

జిల్లాలో చాలామంది ఉపాధ్యాయులు వారికి నచ్చినప్పుడే బడికి వెళ్లడం, మధ్యాహ్నం వరకే ఇంటిముఖం పట్టడం చేస్తున్నారు. వ్యాపారాలు, చిట్టీలు, రియల్ ఎస్టేట్ దందాల్లో మునిగి తేలుతున్నారు. ప్రాథమిక పాఠశాలల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒకరిద్దరు ఉపాధ్యాయులు పనిచేసే చోట పనులకు వెళ్లినప్పటికీ సెలవుపత్రం సమర్పించకుండా డుమ్మా కొడుతున్నారు. మరుసటి రోజు హాజరు పట్టికలో సంతకాలు పెడుతున్నారు. పాఠశాలల్లోని అందరు ఉపాధ్యాయులు ఒకటై వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 2019 నుంచి ఈ బయోమెట్రిక్ హాజరు అమలవుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల్లో పనిచేసే సిబ్బందికి సైతం దీని ద్వారానే హాజరు అమలు చేశారు. కరోనా నేపథ్యంలో ఏడాది పాటు ఇవి మూలన పడ్డాయి. ప్రభుత్వం గతేడాది ఆగస్టు నుంచి పునఃప్రారంభించింది. గైర్హాజరుకు చెక్ పెట్టేలా చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయులతో పాటు బోధనేతర సిబ్బందికి సైతం అమలులోకి తీసుకొచ్చింది. అయితే ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరంలో ఆ యంత్రాలు చాలా చోట్ల మూలనపడ్డాయి. 50 శాతం కూడా వీటిని ఉపయోగించడం లేదని తెలుస్తోంది.

సిగ్నల్ సమస్య సాకు చూపి..

జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో సిగ్నల్ సమస్యను సాకుగా చూపుతూ ఉపాధ్యాయులు బయోమెట్రిక్ వినియోగించడం లేదు. ఆ పాఠశాలలకు మిషన్లు అందుబాటులో ఉన్నా హాజరు వేయట్లేదు. చుట్టపు చూపుగా బడికి వచ్చి వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. బయోమెట్రిక్ నిర్వహణ సరిగ్గా ఉన్న పాఠశాలల్లో మాత్రమే ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ లోపంతోనే..

జిల్లాలోని మారుమూల మండలాలైన ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, బేల, బజార్‌హత్నూర్, తలమడుగు, భీంపూర్ తదితర మండలాల్లో చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. బయోమెట్రిక్ పర్యవేక్షించాల్సిన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ప్రధానోపాధ్యాయులు, మండల, జిల్లా విద్యా శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో డుమ్మా పంతుళ్ల ఆడిందే ఆట అన్నట్లు సాగుతోంది. యంత్రాలు మరమ్మతుకు గురైతే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులే టోల్‌ఫ్రీకి ఫోన్ చేసి మరమ్మతు చేయించుకోవాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క పాఠశాలలో కూడా చెడిపోయిన యంత్రాలను మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చిన దాఖలాలు లేవని తెలుస్తోంది. గతంలో అధికారులు ఉపాధ్యాయుల హాజరుపై ప్రతిరోజు పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఈ విషయంలో జోక్యం చేసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి



టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది బయోమెట్రిక్ ద్వారానే ప్రతిరోజు హాజరువేయాలి. జిల్లాలో ప్రస్తుతం ఈ విధానమే కొనసాగుతుంది. అధికారుల పర్యవేక్షణ జరుగుతుంది. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి. బయోమెట్రిక్ యంత్రాల్లో సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలి.

– జె.నారాయణ, సెక్టోరియల్ అధికారి

అక్షరాస్యతలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి



వలంటీర్లతో కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాను అక్షరాస్యతలో అగ్రస్థానంలో నిలిపేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. స్థానిక టీటీడీసీ సమావేశ మందిరంలో రాత్రిబడి వలంటీర్లతో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్షర క్రమంలో ముందున్న ఆదిలాబాద్ జిల్లాను అక్షరాస్యతలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం కోసం రాత్రి బడి కార్యక్రమాన్ని ప్రారంభించామని గుర్తు చేశారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వివిధ రంగాల్లోని నిరక్షరాస్యులకు ఆదాయ, వ్యయాలు, బ్యాంకు లావాదేవీలు, ఇతరత్రా సమాచారం తెలుసుకునేందుకు చదువు ఎంతో అవసరమన్నారు. మొదటి 47 హాబిటేషన్లలో రాత్రి బడి కార్యక్రమం ద్వారా 926 మంది విద్యనభ్యసిస్తుండగా, ఇప్పటివరకు 827 మంది (90 శాతం) అక్షరాస్యులుగా మారారన్నారు. సామాజిక సేవా దృక్పథంతో సేవలందిస్తున్న వలంటీర్లకు అభినందనలు తెలిపారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య డీడీ శ్రీనివాస్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, డీపీఎంలు హేమలత, శోభ, గంగన్న, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులను పునరుద్ధరించాలి



తెగిన కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ మండలంలో వర్షాలకు దెబ్బతిన్న లక్సెటిపేట్ రహదారి, తెగిపోయిన కల్వర్టును బుధవారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. స్టోర్ రూమ్‌లోని సరుకుల నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ భోజన్న, సర్పంచ్ మల్లిక ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

సీఆర్ఆర్ మృతిపై కాంగ్రెస్ జాతీయ నేతల సంతాపం

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి మృతిపై పార్టీ జాతీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున్ ఖార్గే బుధవారం రాత్రి సంతాప సందేశం పంపించారు. సీఆర్ఆర్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేలు వేర్వేరుగా సంతాప సందేశాన్ని సీఆర్ఆర్ మేనల్లుడు, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డికి పంపించారు.

క్లుప్తంగా

మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప


17కిలోల చేప చూపుతున్న సాయి

సర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుడు సాయి అనే యువకుడికి బుధవారం సుద్దవాగులో వేసిన వలకు 17 కిలోల బొచ్చె రకం భారీ చేప చిక్కింది. దీంతో అతడు సంతోషం వ్యక్తం చేశాడు. మార్కెట్లో మంచి ధర లభించిందని తెలిపాడు.

నిప్పంటించుకొని వృద్ధురాలి ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: నిప్పంటించుకుని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ పురుషోత్తం వివరాల ప్రకారం .. స్థానిక రవినగర్‌కు చెందిన బీరవెల్లి లక్ష్మి (74) తన భర్త రాజేశ్వర్ మూడేళ్ల క్రితం మృతిచెందగా ఒంటరిగా జీవిస్తోంది. అనారోగ్య సమస్యలు, ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తితో మంగళవారం రాత్రి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం ఉదయం వృద్ధురాలు ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు కిటికీలోనుంచి చూసేసరికి కాలిపోయి కనిపించింది. ఆమె కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గాయపడిన యువకుడి మృతి


జ్ఞానేశ్వర్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: ద్విచక్ర వాహనం పైనుంచి పడి గాయపడిన యువకుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... శాంతినగర్‌కు చెందిన జ్ఞానేశ్వర్(35) జిల్లా గ్రంథాలయంలో కాంటాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి బైక్‌పై వెళ్తూ మారెమ్మ ఆలయ సమీపంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు పక్కనే ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే జ్ఞానేశ్వర్ మృతిచెందాడని కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై డాక్టర్లను సంప్రదించగా పరిస్థితి విషమించడంతోనే మృతిచెందాడని తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పురుషోత్తం తెలిపాడు.

పీఏసీఎస్‌లో చోరీ

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. బోథ్ సీఐ భూమేష్ వివరాల ప్రకారం... ప్యాక్స్ కార్యాలయంలో సిబ్బంది బుధవారం ఉదయం కార్యాలయానికి వెళ్లిన సమయంలో కార్యాలయం తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. లోనికి వెళ్లి చూడగా మూడు సీసీ కెమెరాలు, డీవీఆర్, రూ.9వేల నగదు ఎత్తుకెళ్లారు. కేసు నమో ు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ పురుషోత్తం వివరాల ప్రకారం.. స్థానిక రాంనగర్‌కు చెందిన షేక్ పిరోద్‌కు భార్యతో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎటుపడితే అటే...


ఓల్డ్ బస్టాండ్ లో ట్రాఫిక్


బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ


శివాజీ చౌక్‌లో ఇష్టానుసారంగా వెళ్తూ..

- వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు
- ట్రాఫిక్ సిబ్బంది లేక అవస్థలు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- రహదారికి ఇరువైపులా వ్యాపారాలు
- రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్య
- పట్టించుకోని అధికారులు..

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రమైనప్పటికీ పూర్తిస్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదు. జిల్లా కేంద్రంలో నిత్యం రోడ్లు రద్దీగా దర్శనమిస్తాయి. దీనికి కారణం లేకపోలేదు. స్థానికులతో పాటు నిర్మల్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం వేలాదిగా జిల్లా కేంద్రానికి ఏదో ఓ పనిపై వస్తుంటారు. ఈ గ్రామంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. అయితే ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన సిబ్బంది సైతం పూర్తిస్థాయిలో లేకపోవడంతో వాహనదారులకు నిత్యం రోడ్లపై నరకం కనిపిస్తోంది. నియంత్రణ లేకుండా వాహనాలు ఇష్టానుసారంగా వెళ్తుండంతో పలువురు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అరకొర ట్రాఫిక్ సిబ్బంది...

జిల్లా కేంద్రంలో సరిపోయేంత ట్రాఫిక్ సిబ్బంది లేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షా 70వేల మంది నివసించే జిల్లా కేంద్రంలో ఇద్దరు ట్రాఫిక్ ఎస్సైలు, ఒక్కరు ఏఎస్సై, ఏడుగురు కానిస్టేబుళ్లు, ఐదుగురు హోంగార్డులతో పోలీస్‌శాఖ నెట్టుకొస్తుంది. నిజానికి జిల్లా కేంద్రంలో 40మంది ట్రాఫిక్ సిబ్బంది ఉండాలి. అంతేకాకుండా ఇక్కడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అందుబాటులో లేదు. స్థానిక డీఎస్పీ కార్యాలయం పక్కనే తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రం కావడంతో ఎప్పుడైనా రాజకీయ పార్టీల ధర్నాలు, రాస్తారోకోలు ఉంటేనే ట్రాఫిక్ సిబ్బందిలో 80శాతం సిబ్బంది అక్కడే ఉంటారు. దీంతో చౌరస్తాల వద్ద ట్రాఫిక్ మరింత తీవ్రమవుతోంది. సిగ్నల్‌లు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు.

జిల్లా కేంద్రంలోని వాహనాల సంఖ్య

జిల్లా కేంద్రంలోని వాహనాలతో పాటు, ఇక్కడికి పనుల నిమిత్తం వచ్చే వాహనాల సంఖ్య రోజు ఎక్కువగానే ఉంటుంది. ఒక జిల్లా కేంద్రంలోనే ద్విచక్ర వాహనాలు సంఖ్య 102988 ఉన్నాయి. కార్లు 11270 ఉండగా, ఆటో రిక్షాలు 6136 ఉన్నాయి. వీటితోపాటు భారీ వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. కాబట్టి పోలీసు శాఖ ట్రాఫిక్ సిబ్బందిని మరింతగా పెంచాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి..



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధాన సెంటర్లలో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది కలుగుతుంది. నిబంధనలు పాటించని వ్యాపారస్తులు, వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి. దీంతోపాటు ట్రాఫిక్ సిబ్బందిని మరింత పెంచాలి.

ఊరే స్వామి, ప్రైవేటు ఉద్యోగి, నిర్మల్

చర్యలు తీసుకుంటాం..



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. రోడ్డు పై వాహనాలు నిలిపే వాహనదారులపై, రోడ్డు ను అక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకుని జరిమానాలు వేస్తాం. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తాం. ట్రా ఫిక్ ఎక్కువగా ఉండే చౌరస్తాల వద్ద సిగ్నల్స్ టైమింగ్ పెంచుతాం. ట్రాఫిక్ సిబ్బంది పెంచాలని పై అధికారులను సంప్రదిస్తాం.

– అల్లూరి గంగారెడ్డి, డీఎస్పీ, నిర్మల్

రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు..

జిల్లా కేంద్రంలో ప్రధానమైన రోడ్లను అక్రమించి పలువురు వ్యాపారులు వివిధ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పోటీపడి వ్యాపారాన్ని రోడ్డుపైకి తెచ్చారు. దీంతో అక్కడ నిలుపాల్సిన వాహనాలను రోడ్డు మీద ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు పేర్కొంటున్నారు. ప్రధాన రోడ్లపై పశువులతో సైతం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పట్టించుకోని అధికారులు..

జిల్లా కేంద్రంలో అరకొర ట్రాఫిక్ సిబ్బందితో పెట్రోలింగ్, ట్రాఫిక్ పోలీసుల వాహనాలు సైరన్ వేసుకుంటూ అనేకసార్లు అటు, ఇటుగా రౌండ్స్ వేయడమే తప్ప రోడ్డుపై ఉన్న వ్యాపారాలను తొలగించడంలో శ్రద్ధ చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పోలీసులు మధ్యాహ్నం, సాయంత్రం పలు సెంటర్లలో కాపు కాస్తూ వాహనదారులకు మాత్రం జరిమానాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తెరపైకి మరో నూతన మండలం

- పిప్పల్‌ధరిని మండల కేంద్రంగా ప్రకటించాలి
- పీఎంఎస్‌సీ అధ్యక్షుడు తెలంగ్ బాపురావు


నినాదాలు చేస్తున్న సాధన కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ మండలాన్ని ఇది వరకే మావల, ఆదిలాబాద్‌అర్బన్, ఆదిలాబాద్ రూరల్‌గా విభజించగా మరో నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. బుధవారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో సమావేశం నిర్వహించి పిప్పల్‌ధరి మండల సాధన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తెలంగ్ బాపురావు, ఉపాధ్యక్షుడిగా కొడప లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా తాక్‌సాండే నీలకంఠ్, సహాయ కార్యదర్శిగా టేకం సానేరావు, కోశాధికారిగా టంకే నాగోరావు, కార్యవర్గ సభ్యుడిగా మడావి లక్ష్మణ్, టి.గౌతం, ఆనంద్‌రావు, అజయ్ కుమార్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిప్పల్‌ధరి గ్రామంతో పాటు చుట్టు పక్కాల ఉన్న 10 గ్రామ పంచాయతీలు, 35 గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ఆయా గ్రామాలకు పిప్పల్‌ధరి గ్రామం సెంటర్ పాయింట్‌గా ఉందన్నారు. మా గ్రామాలు ఆదిలాబాద్ రూరల్ మండల కేంద్రానికి సుమారు 40కిలో మీటర్ల దూరంలో ఉన్నాయని, పిప్పల్‌ధరి గ్రామంగా మండల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే చుట్టు పక్కాల గిరిజన గ్రామాలకు దూర భారం తగ్గి ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని తెలిపారు. పిప్పల్‌ధరిని వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు బాబారావు, కొండే అనిల్, తదితరులు ఉన్నారు.

వలపు వల

- హనీ ట్రాప్‌లో రిటైర్డ్ ఉద్యోగి
- రూ.2లక్షలకు గాలం వేసిన వ్యభిచార ముఠా
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌టౌన్: వలపు వలలో ఓ రిటైర్డ్ ఉద్యోగి చిక్కుకున్నాడు. వ్యభిచార ముఠా వేసిన గాలానికి బలయ్యాడు. ఆశపడి వచ్చిన రిటైర్డ్ ఉద్యోగిని వారు నిండా ముంచేందుకు పన్నాగం పన్నారు. ఆ వృద్ధుడి న్యూడ్ ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేశారు. డబ్బులు సమర్పించకుంటే పోలీసులను ఆశ్రయిస్తామని, సోషల్ మీడియాలో వీడియోను అప్‌లోడ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ వృద్ధుడు ఆ వ్యభిచార ముఠాకు కొన్ని డబ్బులు అందజేసి అక్కడినుంచి తప్పించుకొని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో బుధవారం వన్‌టౌన్ పోలీసులు ఆ ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ తతంగం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది.

అసలేం జరిగిందంటే..

ఆదిలాబాద్ పట్టణంలోని వాల్మీకినగర్ సమీపంలోని ఆర్‌కే కాలనీలో ఓ మహిళ ఇల్లును అద్దెకు తీసుకుని వ్యభిచార దందాను నిర్వహిస్తోంది. ఈమెకు పట్టణానికి చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇటీవల సదరు మహిళ అతడికి ఫోన్‌చేసి మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ వచ్చిందని, ఆమెకు రూ.వెయ్యి, నాకు రూ.500 ఇవ్వాల్సి ఉంటుందని అతడితో చెప్పింది. దీంతో అతడు తనకు తెలిసిన రిటైర్డ్ ఉద్యోగి ఉన్నాడని, ఆ వ్యక్తిని పంపిస్తానని, అతడిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేయాలని ప్లాన్ చేశాడు. ప్లాన్ ప్రకారం రిటైర్డ్ ఉద్యోగిని అక్కడికి పంపించాడు. అక్కడి చేరుకోగానే రిటైర్డ్ ఉద్యోగిని గదిలోకి పంపించారు. ఆ గదిలోని మరో మహి ళ న్యూడ్ ఫొటోలు తీసింది. కొంత సేపటికి ఆ గదిలోకి నిర్వాహకురాలుతో పాటు మరో మహిళ, మరో ఇద్దరు వ్యక్తులు వెళ్లి బ్లాక్‌మెయిల్ చేశారు. తమకు షీటీం వారు తెలుసని భయపెట్టారు. కొంతసేపు తర్వాత బాధితుడిని పంపించిన వ్యక్తి అక్కడికి చేరుకుని ఏమి తెలియనట్లు జరిగిన విషయాన్ని ఆరా తీశాడు. ముఠా రూ. 2లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు రూ.40వేలు ఇచ్చేలా ఒప్పందం చేశాడు. బాధితుడి వద్ద ఉన్న రూ.3వేలు, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్‌ను తీసుకుని మిగి తా డబ్బులు తెచ్చి వీటిని తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో బాధితుడు అక్కడి నుంచి బయటకు వచ్చి మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఆరుగురు ముఠా సభ్యులను పట్టుకొని అరెస్టు చేశారు. వీరందరూ ఆదిలాబాద్ పట్టణానికే చెందినవారేనని డీఎస్పీ ఉమేందర్ తెలిపారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఉన్నారు.

సమాచారం అందించాలి

ఎక్కడైన వ్యభిచారం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలి. మీ వివరాలను గోప్యంగా ఉంచుతాం. ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు వారి పూర్తి వివరాలు ఇంటి యజమానులు తెలుసుకోవాలి. ఇల్లు అద్దెకు తీసుకొని వ్యభిచారం నడిపిస్తే ఆ ఇంటిని సీజ్ చేస్తాం. ఈ ముఠా నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నాం. ఆరు నెలలుగా వీరు వ్యభిచారం నడుపుతున్నట్లు తేలింది.

– ఉమేందర్, డీఎస్పీ, ఆదిలాబాద్

ఇచ్చోడలో పట్టపగలే చోరీ

- తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం
- 30 తులాల బంగారం, రూ.30 వేల నగదుతో పరారీ


సంఘటన స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇచ్చోడ: పట్టపగలే చోరీకి పాల్పడి దొంగలు హల్‌చల్ సృష్టించారు. తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసి భారీగా బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులకు సవాల్ విసిరిన ఈ ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. విద్యానగర్ కాలనీలోని విఠలేశ్వర మందిరం సమీపంలో వెలిశాల గణేశ్ కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాడు. మెయిన్ రోడ్డు వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. గణేశ్ మాత్రం స్థానికంగా ఓ ఫంక్షన్‌కు హాజరై మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఇంటి ముందు తాళం పగలగొట్టి కనిపించింది. లోనికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై నరేశ్‌తో కలిసి సీఐ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డివిజన్ కోసం బంద్ విజయవంతం

- స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపారులు
- 100 ఆటోలతో భారీ ర్యాలీ


డివిజన్ కోసం నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేయాలని చేస్తున్న ఉద్యమం తీవ్ర తరమవుతోంది. ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం బోథ్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో వ్యాపారుస్తులు, దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. దీక్షలో కూర్చున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులకు వ్యాపారస్తులు తమ సంఘీభావం ప్రకటించారు. రోడ్డుపై వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. డిజె పాటల మధ్య బోథ్‌ను డివిజన్‌గా చేయాలని పాటలపై నృత్యాలు చేశారు. అన్ని పార్టీలు, సంఘాలు, డివిజన్ కోసం ఉద్యమంలో పాల్గొనాలని అన్నారు.

వంద ఆటలతో భారీ ర్యాలీ

బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బోథ్‌లోని ఆటో యూనియన్ సభ్యులు వంద ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బోథ్ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ఆటోలతో ర్యాలీ నిర్వహించి ఉద్యమ తీవ్రతను చెప్పే ప్రయత్నం చేశారు.

కాలినడకన వెళ్లి.. టీకాలు వేసి


చుక్కల మందు వేస్తున్న ఆరోగ్య కార్యకర్త


దన్నుగూడ వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: గత కొద్ది రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారినపడే అవకాశం లేకపోలేదు. అయితే మండలంలోని పిప్పల్‌ధరి సబ్‌సెంటర్ పరిధిలో మారుమూల గిరి గ్రా మమైన బుర్కి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. ఈ గ్రామంలో సుమారు 20 గృహాలు ఉండగా 80 మంది వరకు నివసిస్తున్నారు. దీంతో ఆరోగ్య కార్యకర్త ముయ్యాల మోతి సుమారు 10కిలో మీటర్లు బురదలో కాలినడకన వెళ్లి చిన్నారులకు టీకాలు వేసింది. అలాగే ఆ గ్రామంలో జల్బు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మాత్రలు అందజేశారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలని గ్రామంలోని ప్రజలకు సూచించారు.

వాగుదాటి.. వైద్య శిబిరం

నార్నూర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని దన్నుగూడ గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నారు. బుధవారం హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ గోకూల్, ఏఎన్‌ఎంలు ఈశ్వరీ, విద్యారాణి, ఉషా, యెత్మాబాయి, రూపా ఆశ వర్కర్లు గ్రామ పటేల్ రఘునాథ్ గ్రామస్తుల సహకారంతో వాగు దాటి గ్రామానికి వెళ్లారు. అక్కడే వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నిలువ ఉన్న వర్షపు నీటిని పడబోశారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందని అన్నారు. అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామ పటేల్ అన్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పట్టుకోని వాగు దాటాల్సి ఉంటుందని వాపోయాడు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

తలమడుగు: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన టేకం సునీల్ (30) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినప్పటికీ కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో మంగళవారం తీవ్రమైన నొప్పిరావడంతో గ్రామంలో పురుగుల మందు తాగిపడిపోయాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతిడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపింది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

- ఐటీడీఏ పీవోకు వినతి


పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో దాదాపుగా 10-20 ఏళ్ల అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్‌లకు మెడికల్ -హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కోశాధికారి సుభాష్ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీల ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా లేదా, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రతీ నెల జీతాలు చెల్లించాలన్నారు. అదే విదంగా ఈపీఎఫ్ ఈఎస్ఐ సరిగా కట్టడం లేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా లేదా ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రతీ నెల జీతాలు చెల్లించాలన్నారు. వినతి అందించిన వారిలో మహేష్ రెడ్డి, లలిత, భాను ప్రసాద్, మోయిన్, వెంకటేష్, చంగొన అరుణ్, అర్షద్ ఉన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన షెండే దశరథ్ (40) అదృశ్యమైనట్లు ఎస్సై గోవింద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దశరథ్ మంగళవారం ఉదయం ఎడ్లను మేత కోసం చాందా (టి) శివారు ప్రాంతంలోని నది పరివాహక ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఎడ్లు రాత్రి 8 గంటల ప్రాంతానికి ఇంటికి వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి

- ఆర్టీసీ ఈడీ పి.వినోద్ కుమార్


డీఎం సాయన్నను సన్మానిస్తున్న ఈడీ వినోద్‌కుమార్

ఆదిలాబాద్: ఆర్టీసీని లాభాల బాట పట్టించేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పి. వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయన బుధవారం ఆదిలాబాద్ బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. స్టాళ్లలో విక్రయించే వస్తువులు నాణ్యతగా ఉండాలని, ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని, ప్రమాదాల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా నష్టాలను తగ్గించుకోవడానికి నూతన పద్ధతులను అవలంభించాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ఫలితా లను సాధించిన నిర్మల్ డిపో మేనేజర్ సాయన్నను శాలువాతో సన్మానించారు. రీజినల్ మేనేజర్ సోలోమాన్, డిప్యూటీ ఆర్‌ఎం సురేష్ చౌహాన్, రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య


శృతి(ఫైల్)

తాంసి: తండ్రి మందలిస్తాడనే భయంతో ఇంటర్ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పాలోది గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఆడెపు శృతి(17) మావల సమీపంలోని గురుకుల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రెండు రోజుల క్రితం మోహర్రం పండుగ కోసం కళాశాల నుంచి ఇంటికి వచ్చింది. గ్రామానికి వచ్చిన విద్యార్థిని శృతి బుధవారం మధ్యాహ్నం సమీప గ్రామంలోని ఓ యువకుడి ఇంటికి వెళ్లింది. ఆ యువకుడి తండ్రి సదరు విద్యార్థినిని మందలించాడు. అంతటితో ఆగకుండా విద్యార్థిని ఇంటికి వెళ్లి విషయాన్ని చెప్పాడు. తండ్రి మందలిస్తాడనుకుని భయంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివరాం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమితం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం...

విద్యార్థిని ఆడెపు శృతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న యువకుడు రమాకాంత్ గ్రామ సమీపంలో పురుగుల మందుతాగాడు. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమితం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.